74

# దిబ్బ ప్రభువుగారితో ఇంటర్వ్యూ

సాయంకాలము అయిదుగంటలకు ప్రభువుగారి దర్శనం అవుతుందని కోటనుంచి నాకు కబురొచ్చింది. నా మామూలు దుస్తులతోనే ప్రభువువారిని దర్శించటానికి అనుమతి వచ్చిందిగాని శ్రీ వారికి అధమం మూడు శ్రీ లైనా తగిలించక తప్పదని ఉత్తరువయింది. విప్లవకవుల దగ్గిర్నుంచీ రెండేసి శ్రీలు తగిలించుకున్నారు గనుక నన్నున్నన్నూ కథల్లో బొడెమ్మలకు సహితం రెండేసి శ్రీ. లు ఉంపింపించబడుతున్నాయి గనుక నన్నున్నన్నూ నేను శ్రీ గారిని శ్రీ శ్రీ శ్రీ వారనక తప్పదని కోటవారు నాకు తెలియబరిచారు.

శ్రీ వారు, తోటలో నన్ను ఇంటర్వ్యూ చేస్తారని తెలిసింది. నాకు తోటకన్న శ్రీవారే ముందవుపించారు. ఇంతకూ నాకు తోట అవుపించనే లేదు, ఒకపక్కగా వెడల్పైన ఆకులుగల మొక్క ఒకటి కనిపించింది. అక్కడక్కడ ఎండిపోయిన మొక్కలు పొదలుపొదలుగా కనిపించాయి.

"ఇదేనా శ్రీ శ్రీ శ్రీవారి తోట?" అన్నాను.

"ఇంకా ఉన్నాయి. కాని అన్నిటిలోకీ ముఖ్యమైనదిదే," అన్నారు శ్రీ వారు. దక్షిణంగానూ, తూర్పుగాను ఉన్న చెట్ల సముదాయాలు చూపుతూ, ఆ తోటలు పెద్ద పెద్ద చెట్లతో కూడిఉన్నాయి. చూడటానికి తోటలంటే నమ్మశక్యంగా ఉన్నాయి. శ్రీ వారు నా సందేహం తీర్చారు.

"ఈ తోట మా ముత్తాతగారు దుక్క ప్రభువుగారు వేసినటువంటిది. ఇవన్నీ అప్పుడు వారిచేత్తో వేయింపించిన మల్లెతోటలు... ఆహా! మల్లెల సౌరభం ఆకాలంలో చూడవలసింది! జగ్గకవిగారు ఈ తోటలో మల్లెల్నే వర్ణించి, సురలోకంలో ఉండు కున్నటువంటి పారిజాతాలు వీటితో పోలవని స్పష్టంగా చెప్పారు. మహాకవి!"

"శ్రీ శ్రీ శ్రీ వారి అభిప్రాయంలో మల్లెలకు రానురాను వాసన తగ్గుతోందనా?" అని అడిగాను ఆశ్చర్యంతో.

"అందుకు సందేహం ఏమీలేదు. అన్ని పూలకీ వాసన తగ్గుతోంది. మనుషులంతా నీరసించిపోతున్నట్టే. మీలాగా పాశ్చాత్య సంస్కారంగల వారీ సత్యాలని నమ్మరు."

"శాస్త్రీయమైన ఆధారం ఉంటే—"

"లేకేం ఉంది. మల్లెపూలే తీసుకోండి. ప్రపంచంలో అన్నిటికీ ఏదో పరిమితి ఉంటుందని ఒప్పుకుంటారా?"

"ఒప్పుకుంటాను."

"అయితే మల్లెపూల సౌరభం పరిమితంగా ఉంటుందని మీరే ఒప్పుకుంటున్నారు. ఆ సౌరభం కొద్ది పూల నాశ్రయించినప్పుడున్న సాంద్రత అసంఖ్యాకమైనటువంటి పుష్పజాలానికి సంక్రమించే సరికి—"

"ప్రభువారి అభిప్రాయం అర్థమయింది. మనుషుల సంఖ్యకూడా హెచ్చినకొద్దీ వ్యక్తులు నిర్వీర్యు లవుతారని తమ అభిప్రాయం కాదా?"

"అవును ఇరవయ్యో శతాబ్దమధ్యంలో పొట్టిపొట్టి గొడుగుల్లాంటి మనుషులు పుడతారనీ, వాళ్లు యుద్ధాలు చేసేటప్పుడు శత్రుసేనలమధ్య యోజనాల కొద్దిదూరం ఉంటుంది తప్ప బాహా బాహీ చాచి యుద్ధంచెయ్యరనీ నేనుఘట్టిగా చెప్పగలను."

"యుద్ధమంటే స్ఫురించింది—అడగదగిన ప్రశ్న అవునో కాదో తెలీదు—తమకూ సన్నంరాజుగారికీ యుద్ధంతప్పదని పుకారుగా ఉంది ఇది ఎంతవరకునిజమో సెలవివ్వటానికి శ్రీ శ్రీ శ్రీ వారికేమైనా అభ్యంతరం—"

"ఏమీలేదు, ఒక్కటేముక్క చెబుతున్నాను. నేను శాంతికోరే వాణ్ణి. నాకు యుద్ధాలంటే అసహ్యం. నాప్రజల క్షేమం నాకు కావలసింది. సన్నంరాజుగారు కయ్యానికి కాలుదువ్వుతారు. నే నాయన యెత్తులకు లొంగనని ఆయనకు తెలీదు ఈమధ్య తమదూతను పంపి సన్నంరాజుగారు, నాకు ముప్ఫైవేల కత్తులు అవసరంగా కావాలి. రెండువేల గుర్రాలు కావాలి. ఇవి వెంటనే తమ కార్ఖానాలనుంచీ, అశ్వశాలలనుంచీ ఇప్పిస్తారా యుద్ధానికి వస్తారా? అని కబురుచేశారు. 'కావలిస్తే అంతకు రెట్టింపు కత్తులిస్తానన్నాను గుర్రాలుకూడా ఇచ్చేస్తానన్నాను, కాని యుద్ధానికి ఒప్పుకోలేదు. ఘాలారా నాయుక్తి!"

నా గుండె ఎగిరి గొంతులో కూచుంది.

"ఇదంతా ఉచితంగానే—"

"లేదు; సన్నంరాజుగారి దగ్గిర చక్కని బాణాసంచా తయారుచేసే వాళ్లున్నారు. కత్తులు విలవకీ, గుర్రాల విలవకీ సరిపడా బాణాసంచా పంపమన్నాను."

"అడుక్కుతిన్నట్టేఉంది నీతెలివి." అని లోపల అనుకుని, పైకి,

"దారితప్పి యుద్ధం జరిగితే ఆత్మరక్షణ సన్నాహాలేం చేస్తారు ?"

"ఏముందీ చెయ్యటానికీ ? నామాట శిరసావహించే నాబిడ్డల్లాటి ప్రజలున్నారు. వాళ్ళు చచ్చయినా పోతారు గాని ఓటమికి ఒప్పుకోరు."

"క్షమించండి. మీ ఏలుబడిలో సస్యసమృద్ధి చాలా తక్కువగా ఉన్నట్టు కనిపించింది. అనేకచోట్ల నీటివసతులులేక పంటలెండిపోతున్నాయి. చెరువుల్లో పూటు తీస్తున్నట్టు కనిపించదు. ఆహారసమృద్ధిలేని ప్రజలు యుద్ధంచెయ్యగలరా ?

"పిచ్చివాడా, శరీరబలంతో పోరేవాడేం పోరగలడు ? దైవబలం ఉండాలి. చెరువుల విషయమూ, పొలాల విషయమూ నేనంగీకరిస్తాను. కాని ఏంచెయ్యనూ ? నేనాట్టే ఖర్చుదారునుకాను. నాకు సరిపడా రాబడి ఉంది. ఉన్న పొలాలన్నీ బాగుచేయించి పండించి ఆ పంటంతా ఏం చేసుకుంటాం ?"

"తమ యేలుబడిలో అందరికీ తిండి సమృద్ధిగాఉందా ? తిండికిమాడే ప్రజలున్నట్టు కనిపిస్తారే ?"

"పనిచెయ్యనివారికి తిండిలేదేమోగాని పనిచేసేవారందరికీ కడుపు నిండా తిండిఉంది"

"పనిలేని వాళ్ళకి సాగుబడిచెయ్యని పొలాలివ్వరాదా ? చెరువులు బాగుచేయించరాదా!"

"నాకీ రాబడి చాలునని చెప్పానుగా! నేను కొందరు కొందరు రాజుల్లాగ ఖర్చుదారును కాను. నారాబడి ఇంకా తగ్గిపోయినా నేను సుఖంగా బతకగలను. అందుచేత కొన్ని పొలాలు బీడుపెట్టే యిద్దామనుకుంటున్నాను."

"మరింత మంది తిండికిమాడి చావరా?"

"నా పొలాలు నేను బీడుపెట్టటానికి ఒకరి ఆజ్ఞకావాలా!" అన్నారు ప్రభువువారు కళ్ళెర్రజేసి.

"క్షమించాలి, ప్రభువులు. నేను చెప్పిందేమంటే ప్రజలు తమ నిర్ణయాన్ని అంత నయంగా అమోదిస్తారా అని."

"వాళ్ళు దైవభక్తి పరులు. భగవంతుడిస్తే దొరుకుతుందనీ, లేకపోతే లేదనీ, వాళ్ళెరుగుదురు."

"వాళ్ళకి విద్యాసౌకర్యాలేవిధంగా ఉంటాయి తమఏలుబడిలో."

"విద్యలో నాకు విశ్వాసం లేదు. శరీరంవొంచి కష్టించే ప్రజలు చదువు మరిగితే పనిచెయ్యరు. కవిత్వాలు చెప్పి కానుకలు గుంజుతారు. నాకు కవిత్వమంటే మంట. వచనం అర్థమయినంత సులువుగా మనకు ఎప్పుడన్నా పద్యం అర్థమవుతుందా? అదీకాక చదువుకోవాలంటే ఇప్పటికే ఎన్నో మహాగ్రంథాలున్నాయి. ఒక్క భారతం చాలదా జన్మల్లా చదవటానికి. నేను పదిహేనేళ్ళ నుంచీ చదువుతున్నాను. అరణ్యపర్వం అవకుండా ఉంది. భారతం తెరిచేసరికి నాకు బ్రహ్మానందమై సుషుప్తికలుగుతుంది. మహాకావ్యం! మహాకావ్యం!"

"తమరేలుబడిలో పరిశ్రమ లెట్లా ఉన్నాయి?"

"ఉన్నాయి. ఫరవాలేదు. వడ్రంగులూ, కమ్మరవాళ్ళూ, సాలెవాళ్ళూ ఉన్నారు. ఇంకేం కావాలి!"

"సన్నంరాజుగారి పరిపాలనలో పరిశ్రమలు బాగా సాగుతున్నాయని విన్నాను." "అందచేతనే అతన్ని బొమ్మనుచేసి ధనికులంతా ఆడిస్తున్నారు. మళ్ళీ ఎక్కడా అనకండి; సన్నంరాజును నా మీదికి ఉసికొల్పే వాళ్ళు పారిశ్రామికులే. వాళ్ళకి మా రాజ్యంలో ఉండే ఇనపమట్టి కావాలి. నారాజ్యంలో తయారయే కత్తులన్నీ ఇమ్మన్నా ఇస్తానుగాని ఆ ఇనపమట్టి సన్నంరాజుకి దక్కనిస్తానా? మా తాతగారు చెబుతుండేవారు. ఆ మట్టిలో కోటానకోట్లు కత్తులున్నాయని. అమ్మో? నేనేం వెర్రివాణ్ణైనా!"

విన్న సంగతులతో నాకు మొహం మొత్తింది. నేను సెలవు పుచ్చుకోటానికి ఉపక్రమిస్తూండగా నాకన్ను ఆ తోటలో ఉన్న ఒక్క మొక్క మీద పడింది. అదే తోటలకల్లా మహోన్నతంగా ఉంది.

"ఇదేం వృక్షమో తెలుసుకోవచ్చునా?" అన్నాను.

శ్రీ వారు నవ్వి, "విత్తునాటినప్పుడు నాకు అదే సందేహం కలిగి నాటిచూశాను. చెట్టు పెరిగాక అది ఆముదపు చెట్టని శాస్త్రవేత్తలు చెప్పారు" అన్నారు.

"తమరు ఈ తోటలో మరికొన్ని చెట్లుకూడా వేయించలేక పోయారా?" అన్నాను.

"వేయించాను, కాని అవి దీన్నిమించి పెరిగాయి. అంచేత కొట్టింపించవలసొచ్చింది," అన్నారు శ్రీ వారు ఆముదపు చెట్టువేపు గర్వంగా చూస్తూ.